జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





శుక్రవారం, జూలై 24, 2026 పేజీలు : 9


### అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు

# చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



కల్వకుర్తి, జులై 23( ప్రజా జ్యోతి ): అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కల్వకుర్తి నియోజకవర్గం లోనీ పొతేపల్లి, యంగం పల్లి, జిల్లెల, మార్చాల గ్రామాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)లకు పలు సూచనలు చేశారు. మరో పది రోజుల్లో ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇతర అభ్యర్థనలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఓటర్లకు ఎలాంటి

# నేరాల నియంత్రణలో అప్రమత్తంగా ఉండాలి

-మహబూబ్‌నగర్,జిల్లా ఎస్పీ జానకి

- ఎన్హెచ్ -44పై ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక పర్యవేక్షణకు ఆదేశాలు




### శిథిలావస్థలో నారాయణపేట జిల్లా

# మార్చురీ భవనం

- కనీస సౌకర్యాలు లేక మృతుల కుటుంబాలకు ఇబ్బందులు..
- నూతన భవనం నిర్మించాలని ప్రజల డిమాండ్



**నారాయణపేట, ప్రతినిధి జూలై 23 ప్రజా జ్యోతి**

జిల్లా కేంద్రంలోని పాత ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రభుత్వ మార్చురీ (పోస్టుమార్టం) భవనం శిథిలావస్థకు చేరి, మృతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా దెబ్బతినడంతో భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.మార్చురీ గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, స్లాబ్‌లోని ఇనుప రాడ్లు బయటపడటం, గోడలు పగుళ్లు రావడం, నేల దెబ్బతినడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. భవనం ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు ఇప్పటి వరకు సమగ్ర మరమ్మతులు

### ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో

# జాగ్రత్తగా ఉండాలి

**అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం.**

**ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు**

**మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి.**

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**




**నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)**

ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే

## శిథిలావస్థలో నారాయణపేట జిల్లా
# మార్చురీ భవనం

చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో పోస్టుమార్టం కోసం వచ్చే మృతుల కుటుంబ సభ్యులకు కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం ఆవేదన కలిగిస్తోంది. వేచి ఉండేందుకు సరైన ప్రదేశం, పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు వంటి మౌలిక వసతులు లేకపోవడంతో శోకసంద్రంలో ఉన్న కుటుంబాలు మరింత ఇబ్బందులు పడుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

జిల్లా ఏర్పడి సంవత్సరాలు గడిచినా, జిల్లా స్థాయికి తగిన ఆధునిక మార్చురీ భవనం అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్య సేవల్లో కీలకమైన పోస్టుమార్టం విభాగానికే సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి,



శిథిలావస్థలో ఉన్న పాత మార్చురీ భవనానికి ప్రత్యామ్నాయంగా అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన మార్చురీ భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు తెలిపారు.

ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని, అవసరమైతే మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎదమ సత్యం, సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు విజయ్ గౌడ్, బాలయ్య,మాజీ సర్పంచ్ దేశం వెంకట్రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మదన్మోహన్ మోహన్ రావు, వార్డు సభ్యులు,పార్టీ ప్రసిడెంట్లు,మాజీ ఎంపీపీ లు, తాజా మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీ లు, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో
# అప్రమత్తంగా ఉండాలి


మహబూబ్‌నగర్, జూలై 23( ప్రజా జ్యోతి బ్యూరో ): నేరాల నియంత్రణలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశించారు. వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం మూసాపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం నమోదైన నేరాలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రతి బాధితుడికి సత్వర స్పందన అందించి, పోలీసు సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా పనిచేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా సేవలందించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి శాఖాపరమైన అవసరాలు, సమస్యలను తెలుసుకుని, విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

మూసాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి ఎన్హెచ్-44 ఉండటంతో పాటు వేముల ఎక్స్ రోడ్, జానంపేట ప్రాంతాల్లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణతో నిరంతర ట్రాఫిక్ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ఈ తనిఖీలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మూసాపేట ఎస్ఐ వేణు, అడ్డాకల్ ఎస్ఐ మురళి, భూత్పూర్ ఎస్ఐ నాగన్నతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో
# జాగ్రత్తగా ఉండాలి

సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుత సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటివి జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని



తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.

జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ గారు తెలిపారు.

## అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరు ఓటర్ జాబితాలో నమోదు కావాలి

### -ఎమ్మెల్యే డాక్టర్.కూచకుళ్ళ రాజేష్ రెడ్డి



నాగర్ కర్నూల్ : జులై 23 (ప్రజా జ్యోతి)

బిజినపల్లి మండల కేంద్రంలోని ఎం.పీ.డీ.వో‌కార్యాలయంలో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని,ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై పార్టీ నాయకులు,బీఎల్ఏలకు అవగాహన కల్పించారు.అనంతరం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుత అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమని ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, కొత్తగా అర్హత పొందినవారి పేర్లను నమోదు చేయడంతో పాటు,తప్పులు,లోపాలుంటే వెంటనే సరిదిద్దేలా చర్య తీసుకోవాలని బీఎల్ఏలకు సూచించారు.ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని,ఏ ఒక్క అర్హుడ ఓటరు జాబితాకు దూరం కాకుండా పార్టీనాయకులు అప్రమత్తంగా ఉండి పనిచేయాలని,ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ౫×= కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు,బీఎల్ఏలు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు కలెక్టర్ సూచనలు

నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)

ఎల్ నినో వాతావరణ పరిస్థితులలో రైతులు వ్యవసాయ ప్రత్యామ్నాయ పంటల సాగు పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు.గురువారం నారాయణపేట జిల్లా కేంద్రం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎల్ నినో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా తయారు చేయబడ్డ ఎల్ నినో నేపథ్యంలో పంటల ప్రణాళికలు పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల పంపిణీలో అసమానతలు ఏర్పడే అవకాశం ఉందని. ఈ పరిస్థితుల్లో ప్రతి రైతు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టడం అవసరం అన్నారు.వాతావరణ శాఖ విడుదల చేసే అంచనాలను ఎప్పటికప్పుడు గమనించి వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ కి రైతులు తెలియచేయడం జరిగింది. వారి సమస్యలు విని, సమస్యలు పరిష్కరిస్తాం అని రైతులకు తెలియచేయడం జరిగింది.రైతు శాస్త్రవేత్త డాక్టర్ సత్య నారాయణ మాట్లాడుతూ వివిధ పంటలలో సస్య రక్షణ చర్యల గురించి, అలాగే ఎల్ నినో వాతావరణ పరిస్థితుల్లో రైతులు చెప్పల్సిన చర్యల గురించి, నానో యూరియా నానో డి ఏ పి వాడకం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, , జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, శాస్త్రవేత్తలు ,గ్రోమోర్ అధికారి ఇతర అధికారులు, రైతులు మరియు గ్రోమోర్ కంపెనీ వారు పాల్గొనడం జరిగింది.



# బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తోంది:ఎర్రవల్లిలో కాంగ్రెస్ ఆగ్రహ నిరసన

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) జూలై 23:**
నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఎర్రవల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టారు.టీపీసీసీ పిలుపుమేరకు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎర్రవల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుటాన్ దొడ్డి వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ,"నీట్ పేపర్ లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడినా బీజేపీ ప్రభుత్వం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది.విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం,ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి ప్రయత్నిస్తోంది.ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడం బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం.ప్రజల స్వేచ్ఛను,ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ఈ విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా



ఖండిస్తోంది"అని అన్నారు.నిరసనకారులు నీట్ పేపర్ లీక్‌పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని,విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని,రాహుల్ గాంధీ అరెస్టును వెంటనే ఉపసంహరించుకోవాలని,ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు,మండల నాయకులు,యువజన కాంగ్రెస్,ఎన్ఎస్‌యూఐ నాయకులు, సర్పంచులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుపై ఐజలో కాంగ్రెస్ ఆగ్రహ జ్వాలలు

## మోదీ దిష్టిబొమ్మ దహనం,బీజేపీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భారీ నిరసన

**అలంపూర్ (ప్రజా జ్యోతి) జూలై 23:**
లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ,నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఐజ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.టీపీసీసీ పిలుపు మేరకు,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ సూచనలతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జయన్న నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికివ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు.నిరసనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి,కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.నీట్ పేపర్ లీక్‌తో 22 లక్షల మంది విద్యార్థులభవిష్యత్తును బీజేపీ ప్రభుత్వం ప్రమాదంలోకి నెట్టిందని, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించే వారిపైనే నిర్బంధాలుకొనసాగించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని కాంగ్రెస్ నాయకులుతీవ్రస్థాయిలో విమర్శించారు.ఈ సందర్భంగానాయకులు మాట్లాడుతూ,"విద్యార్థులజీవితాలతో చెలగాటం ఆడిన బీజేపీ ప్రభుత్వం నైతిక బాధ్యతవహించాలి.నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా



చేయాలి.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ వైఫల్యానికి సమాధానం చెప్పాలి.విద్యార్థులకు అండగా నిలిచిన రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం బీజేపీ ప్రభుత్వ నిరంకుశ,ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనం"అని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నల్లారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామేశ్వరమ్మ,పీసీసీ వైస్ చైర్మన్ కురుమన్న,మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప,సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రాముడు,డీసీసీ నాయకులు,కౌన్సిలర్లు,సర్పంచులు,మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

# ఢిల్లీ విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండిస్తూ గద్వాలలో విద్యార్థి సంఘాల నిరసన

**గద్వాల జూలై 23(ప్రజా జ్యోతి):**
ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తూ,అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని,వారిపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్యు,ఏఐఎస్ఎఫ్,ఎన్ ఎస్ యు ఐ, బి ఆర్ ఎస్ వి, యు ఎస్ ఎఫ్ ఐ,విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం గద్వాల జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌక్ మీదుగా పాత బస్టాండ్ వరకు కొనసాగింది.విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు హలీం పాషా మాట్లాడుతూ,దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా,వాటి పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.ఉన్నత విద్యలో అవినీతి,పరీక్షల నిర్వహణలో అక్రమాలు,నిరుద్యోగం,విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఢిల్లీలో నిర్వహించిన శాంతియుత ధర్నాపై పోలీసులు దాడి చేయడం దురదృష్టకరమన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి,ముఖ్యంగా విద్యార్థులకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు.అయితే విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై స్పందించాల్సిన కేంద్ర ప్రభుత్వం,పోలీసు బలగాలను ఉపయోగించి ఉద్యమాలను అణచివేయాలని చూడడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని అన్నారు విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ,తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి,జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య,పిడిఎస్యు నాయకుడు హరీష్,ఏఐఎస్ఎఫ్,జిల్లా కార్యదర్శి ప్రవీణ్,ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్,యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామనపల్లి రంగస్వామి,భరత్,గజేంద్ర,అనాస్ పాల్గొన్నారు.




# మహిళల ఆర్థిక సాధికారతకు వీఓ భవనాలు కీలకం

## అదనపు కలెక్టర్ బి.నర్సింగరావు



**గద్వాల జూలై 23(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
మహిళల ఆర్థిక సాధికారతతో పాటు స్వయం సహాయక సంఘాల బలోపేతానికి విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) భవనాలు కీలకంగా మారనున్నాయని అదనపు కలెక్టర్ బి.నర్సింగరావు అన్నారు.గురువారం వడ్డేపల్లి మండలం బుడమర్తి గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తయిన విలేజ్ ఆర్గనైజేషన్ భవనాన్ని ఆయన పరిశీలించారు.జిల్లాలోనే తొలిసారిగా నిర్మాణం పూర్తయిన ఈ భవనాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ భవన నిర్మాణ నాణ్యత,మౌలిక వసతులు, సమావేశ మందిరం,ఇతర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,స్వయం సహాయక మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, నాయకత్వ వికాసం,సంఘాల సమావేశాలు,శిక్షణ కార్యక్రమాలు,పొదుపు--రుణాల నిర్వహణ,జీవనోపాధి ప్రణాళికల అమలుకు ఈ విలేజ్ ఆర్గనైజేషన్ భవనం కేంద్రంగా ఉపయోగపడాలని సూచించారు.భవనాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా,సక్రమంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తిగా సంరక్షించాలని,మహిళా సంఘాల సభ్యులు దీనిని పూర్తిస్థాయిలో వినియోగించుకొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.భవన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు,గ్రామ పంచాయతీ ప్రతినిధులు,మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాజోలి కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ బి.నర్సింగరావు

**కేజీబీవీల్లో నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**గద్వాల జూలై 23(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.నర్సింగరావు సూచించారు.గురువారం రాజోలి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న విద్య,వసతి,భోజన సౌకర్యాలను పరిశీలించారు.తరగతి గదులు,వసతి గృహాలు,వంటశాల,భోజనశాల,తాగునీటి సౌకర్యం,పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని,ఆహార నాణ్యత,పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని సంబంధిత అధికారులకు ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్యం,భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు యూనిఫాంలు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు.ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్,సిబ్బంది,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# (నీట్ ) పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి!

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి!**
**రేపటి విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చెయ్యాలి.**

**నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)**
రేపు రాష్ట్ర వ్యాపితంగా జరిగే విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చెయ్యాలని విద్యార్థి, యువజన సంఘాలు నారాయణ పేట జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, మహేష్, ఎన్ ఎస్ యు ఐ నాయకుడు అన్వర్ అంబేద్కర్ జాతర కమిటీ నాయకులు రమేష్, నిరుద్యోగ యువకుడు ఫయాజ్ లు మాట్లాడుతూ నీట్ ( నీట్) పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, వారికి చట్టప్రకారం శిక్ష విధించాలి. దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ప్రగతిశీల యువజన సంఘం ( పి వై ఎల్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్లతో ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువజనులపై పోలీసులు అమానుషంగా




లాఠీచార్జీ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి. ఈ దమనకాండను విద్యార్థి, యువజన సంఘాల తెలంగాణ రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూలై 24 న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే విద్యాసంస్థల బంద్ ను రాష్ట్రంలోని విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు ఈ బంద్ ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా నాయకులు శ్రీకాంత్, పృధ్వి పి డి ఎస్ యు నాయకులు అనీల్, గణేష్, నరేష్, అంబేద్కర్ జాతర కమిటీ సభ్యులు పాండు, చంటి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

## కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, జూలై 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తప్పులు లేకుండా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించిన ఆమె, జిల్లాలో ఇప్పటికే 79.62 శాతం డిజిటైజేషన్ పూర్తికాగా, 86.55 శాతం ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, పరిశీలన పూర్తైందని తెలిపారు. ఎన్నికల సంఘం గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడంతో ప్రజలకు అదనపు అవకాశం లభించిందన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారని, 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఆర్‌వోలకు సూచించినట్లు చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లను నేరుగా తొలగించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, క్షేత్రస్థాయి విచారణ అనంతరం మాత్రమే మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన లేదా గుర్తించలేని ఓటర్ల పేర్లను తొలగిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫారం సమర్పించిన వారు మళ్లీ భౌతికంగా ఇవ్వాల్సిన అవసరం లేదని, బీఎల్‌వోలు కేవలం ధృవీకరణ



మాత్రమే నిర్వహిస్తారని వివరించారు. ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం ఓటరు జాబితా ప్రక్షాళన మాత్రమేనని పేర్కొన్న కలెక్టర్, ప్రస్తుత ప్రక్రియ పూర్తైన తర్వాత ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి ప్రజలు, రాజకీయ పార్టీలు అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. అనుమానాస్పద నమోదులపై ఆధారాల పరిశీలన అనంతరమే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఎన్నికల డీటీ జాఫర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికల పాఠశాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమం

## గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి

అయిజ జూలై 23(ప్రజా జ్యోతి):గర్భాశయ ముఖద్వార (సర్వికల్) క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ అత్యంత కీలకమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో అర్హత కలిగిన విద్యార్థినీలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హెచ్‌పీవీ వైరస్ వల్ల భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో ఈ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 2011 జూలై 19 నుంచి 2012 జూలై 19 మధ్య జన్మించిన అర్హత కలిగిన విద్యార్థినీలకు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమైనదని, బాలికల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన కార్యక్రమమని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎం ప్రమీల, ఆశా కార్యకర్తలు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.



# బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గోమాతకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు

**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 23 (ప్రజా జ్యోతి):**
నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఓ ఆవు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిందన్న విషయాన్ని తెలుసుకున్న మఖ్తల్ బజరంగ్ దళ్ శాఖ కార్యకర్తలు ఆలయం వద్దకు చేరుకుని ఆలయ భక్తులతో కలిసి ఆలయం పక్కనే జెసిబి సహాయంతో గుంతను తవ్వించారు. మన సంప్రదాయంలో అంత్యక్రియలకు ఎంతో



పవిత్రత ఉంది. గోవును దేవతగా పూజించే సంస్కృతి మనది కాబట్టి బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో దేవాలయ అర్చకుడు తిప్పయ్య స్వామి పర్యవేక్షణలో అనారోగ్యంతో చనిపోయిన గోమాతకు శాస్త్రోక్తంగా మరియు సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి గోమాతకు కడసారి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తిప్పయ్య స్వామి,నారాయణ పేట జిల్లా బజరంగ్ దళ్ కో -కన్వీనర్ భీమేష్,ప్రఖండ సహ సంయోజక్ మూర్తి,మండల గోరక్ష సంయోజక్ శ్రీను, మల్లయ్య స్వామి, అక్షయ్,నాగరాజు,చక్రి,రాజు ,రాము, బజరంగ్ దళ్ కార్యకర్తలు ఇతరతులు పాల్గొన్నారు.

# నూతన గృహ నిర్మాణాలలో ఇంకుడు గుంత అవసరం

**నారాయణపేట మున్సిపల్ కమిషనర్ ఎన్.శంకర్**

నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)
వర్షం పడిన చోటే వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాలను పెంచడమే 'క్యాచ్ ది రెయిన్' కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు.
ప్రతి ఇల్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు ( ఇంకుడు గుంతలు) ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.
పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి పెద్ద పెద్ద అపార్ట్మెంట్లలో కచ్చితంగా ఇంకుడు గుంతలు నిర్మించే విధంగా యజమానులకు సూచనలు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు.
పట్టణంలో నీరు ప్రవహించే నాళాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని,నీరు సక్రమంగా ప్రవహించి చెరువులు కుంటలలోకి మాత్రమే వెళ్లాలన్నారు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకుడు గుంతలు నిర్మించకొనుటకు ప్రత్యేక కార్యక్రమానికి ప్రవేశపెట్టడం జరిగినది(2 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతుగా)నిర్మించ వలసి ఉన్నది. ప్రతి వర్షపు చుక్కను వడిచిపట్టి భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించాలని చెప్పారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాల మొత్తాన్ని పెంచవచ్చని, బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందన్నారు. మరియు పర్యావరణాన్ని కాపాడిన వారి మౌతామన్నారు. కార్యక్రమంలో గౌరవ కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్, మేనేజర్ ,వార్డు అధికారులు, మహిళ సంఘం సభ్యులు, పట్టణ ప్రజలు మరియు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రాయితీ పాస్.. చార్జీల మోత!

## -జర్నలిస్టుల ప్రయాణ రాయితీకి టిమ్ మిషన్లే అడ్డంకా?
## - పాస్‌పై 1/3 రాయితీ.. టికెట్ తీసుకునే సరికి అదనపు బాదుడు
## -ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో మరింత భారం
## -'సాఫ్ట్‌వేర్' పేరుతో రాయితీకి కోత..
## ఆర్టీసీ తీరుపై జర్నలిస్టుల ఆవేదన

**నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించే జర్నలిస్టులకు తెలంగాణ ఆర్టీసీ ప్రయాణ రాయితీ ఆచరణలో భారంగా మారుతోందని టీయూడబ్ల్యూజే హెచ్--143 జిల్లా అధ్యక్షుడు కలాల్ ఆనంద్‌కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు వారధి నవీన్‌కుమార్, టెంజు జిల్లా అధ్యక్షుడు అవుటి రాజశేఖర్ అన్నారు.
జర్నలిస్టులకు కల్పిస్తున్న 1/3 ప్రయాణ రాయితీని అన్ని బస్సు సర్వీసుల్లో సక్రమంగా అమలు చేయాలని -- టికెట్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్‌వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డిప్యూటీ ఆర్ఎం జగన్, డీఎం రాంమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జర్నలిస్టు పాస్‌పై మూడో వంతు (1/3) ప్రయాణ రాయితీగా పేర్కొంటున్నప్పటికీ.. టికెట్ జారీ సమయంలో ఆ రాయితీ పూర్తిస్థాయిలో వర్తించడం లేదని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాస్ ఒకటి చెబుతుంటే.. టిమ్ మిషన్ మరో లెక్క చూపుతోందని పేర్కొంటున్నారు. ఫలితంగా వార్తల సేకరణ కోసం నిత్యం బస్సుల్లో ప్రయాణించే విలేకరులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని చెబుతున్నారు.

**పాస్‌లో రాయితీ.. టికెట్‌లో కోత!**

జర్నలిస్టులకు అందుబాటులో ఉన్న ప్రయాణ రాయితీ ఉద్దేశం వార్తల సేకరణలో భాగంగా వివిధ ప్రాంతాలకు వెళ్లే సమయంలో ప్రయాణ ఖర్చును తగ్గించడం. అయితే క్షేత్రస్థాయిలో ఈ రాయితీ అమలు విషయంలో స్పష్టత లేకపోవడంతో సమస్య తలెత్తుతోందని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. జర్నలిస్టు పాస్‌పై మూడో వంతు (1/3) రాయితీగా పేర్కొన్నప్పటికీ.. టికెట్ జారీ చేసే టిమ్ మిషన్లలో రాయితీకి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ సెట్టింగులు లేకపోవడం లేదా సాంకేతిక సమస్యల కారణంగా అదనపు చార్జీలు వసూలవుతున్నాయని ఆరోపిస్తున్నారు. పాస్‌పై కనిపించే రాయితీకి, టికెట్‌లో చెల్లించాల్సిన మొత్తానికి మధ్య వ్యత్యాసం ఏర్పడుతోందని చెబుతున్నారు.

**'మిషన్' చూపిందే ఫైనల్!**

రాయితీపై జర్నలిస్టులు కండక్టర్లను ప్రశ్నించినప్పుడు.. టిమ్ మిషన్‌లో సాఫ్ట్‌వేర్ ఎలా ఫీడ్ అయి ఉంటే దాని ప్రకారమే టికెట్ జారీ చేయాల్సి వస్తోందని వారు చెబుతున్నారని నాయకులు పేర్కొంటున్నారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసే అధికారం తమకు లేదని కండక్టర్లు సమాధానం ఇస్తున్నారని తెలిపారు. దీంతో సాంకేతిక సమస్యకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఎవరిదన్న ప్రశ్న తలెత్తుతోంది. సమస్యపై జర్నలిస్టులు ప్రశ్నిస్తే కండక్టర్లు నిబంధనలు, మిషన్ లెక్కలను చూపుతుండగా.. రాయితీని పూర్తిగా పొందలేక జర్నలిస్టులు అదనపు మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎక్స్‌ప్రెస్.. ఎలక్ట్రిక్.. అదనపు బాదుడు!**

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే జర్నలిస్టులకు వార్తల సేకరణ కోసం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాలు, నగరాలకు నిత్యం ప్రయాణం తప్పనిసరి. సమయానికి వార్తలు అందించేందుకు చాలాసార్లు ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సర్వీసులను ఆశ్రయించాల్సి వస్తుంది. అయితే ఈ సర్వీసుల్లో ప్రయాణ చార్జీలు ఎక్కువగా ఉండటంతో.. రాయితీ సక్రమంగా అమలు కాకపోతే అదనపు భారం మరింత పెరుగుతుంది. ఒక రోజు, రెండు రోజుల సమస్యగా కాకుండా ప్రతిరోజూ ప్రయాణించే జర్నలిస్టులపై నెలవారీగా గణనీయమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొంటున్నారు.

**గ్రామీణ విలేకరులకే ఎక్కువ నష్టం!**

జిల్లా కేంద్రాల్లో పనిచేసే వారితో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని విలేకరులు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. మండల కేంద్రాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, రైతుల సమస్యలు, ప్రమాదాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రజా సమస్యలపై వార్తల సేకరణ కోసం నిత్యం పర్యటించాల్సి ఉంటుంది. ఒక్కోసారి ఒకే రోజులో రెండు, మూడు ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో బస్సు ప్రయాణాలు పెరుగుతాయి. ఈ నేపథ్యంలో ప్రతిసారి రాయితీ సక్రమంగా అమలు కాకపోతే.. నెలాఖరుకు ప్రయాణ ఖర్చుల భారం మరింత పెరుగుతుందని జర్నలిస్టులు చెబుతున్నారు. పరిమిత ఆదాయంతో పనిచేసే గ్రామీణ విలేకరులకు ఇది ఆర్థిక ఇబ్బందిగా మారుతోందని పేర్కొంటున్నారు.

**కండక్టర్--జర్నలిస్టు మధ్యే వివాదం!**

రాయితీ అమలులో సాంకేతిక లోపాలు ఉన్నప్పటికీ.. దాని ప్రభావం మాత్రం క్షేత్రస్థాయిలో కండక్టర్లు, జర్నలిస్టుల మధ్య వివాదాలకు దారితీస్తోందని అంటున్నారు. మిషన్‌లో కనిపించే చార్జీ ప్రకారమే టికెట్ ఇవ్వాల్సి వస్తోందని కండక్టర్లు చెబుతుండగా.. పాస్‌పై ఉన్న రాయితీ ఎందుకు అమలు కావడం లేదని జర్నలిస్టులు ప్రశ్నిస్తున్నారు. అసలు సమస్య సాఫ్ట్‌వేర్‌లో ఉంటే.. దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఆర్టీసీ ఉన్నతాధికారులదేనని జర్నలిస్టు సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. కండక్టర్లపై ఒత్తిడి తీసుకురావడం లేదా జర్నలిస్టులతో వాగ్వివాదాలకు దారితీసే పరిస్థితులు కల్పించడం కాకుండా.. సాంకేతిక సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**అన్ని డిపోల్లో ఒకే విధానం ఉండాలి**

జర్నలిస్టుల ప్రయాణ రాయితీ అమలుపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల్లో ఒకే విధమైన విధానం ఉండాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. ఏ బస్సులో ఎంత రాయితీ వర్తిస్తుంది? ఏ రకం పాస్‌కు ఎలాంటి ప్రయోజనం ఉంటుంది? అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని అంటున్నారు. టికెట్ మిషన్‌లో జర్నలిస్టు పాస్ వివరాలు నమోదు చేసిన వెంటనే వర్తించే రాయితీ, చెల్లించాల్సిన మొత్తం స్పష్టంగా కనిపించేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలని సూచిస్తున్నారు. దీంతో ప్రయాణికుడు, కండక్టర్ ఇద్దరికీ ఎలాంటి గందరగోళం ఉండదని పేర్కొంటున్నారు.

**సాఫ్ట్‌వేర్ సరిచేస్తే.. వివాదాలకు చెక్!**

జర్నలిస్టులకు వర్తించే ప్రయాణ రాయితీని టిమ్ మిషన్లలో నిబంధనలకు అనుగుణంగా సాంకేతికంగా అమలు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జర్నలిస్టులు చెబుతున్నారు. పాస్ స్కాన్ చేసిన వెంటనే రాయితీ ఆటోమేటిక్‌గా వర్తించే విధంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని కోరుతున్నారు. అదేవిధంగా రాయితీపై కండక్టర్లకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కల్పించాలని, డిపో స్థాయిలో ఫిర్యాదులను స్వీకరించి వెంటనే పరిష్కరించే వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

**ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి**

జర్నలిస్టులకు అమల్లో ఉన్న మూడో వంతు (1/3) ప్రయాణ రాయితీని నిబంధనల ప్రకారం అన్ని అర్హత కలిగిన బస్సు సర్వీసుల్లో సక్రమంగా అమలు చేయాలని టికెట్ మిషన్లలోని సాఫ్ట్‌వేర్ సమస్యలను వెంటనే పరిష్కరించడంతోపాటు.. జర్నలిస్టుల ప్రయాణ రాయితీపై కండక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. పాస్‌పై ఒక రాయితీ.. టికెట్‌లో మరో చార్జీ అనే పరిస్థితికి ముగింపు పలకాలని అన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర నాయకులు అనంతరాము, నాయకులు డి.నారాయణ, వినోద్, శ్రీధర్‌రావు, రమేష్‌గౌడ్, రమేష్ తదితరలు పాల్గొన్నారు.



## ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మృతి వనం నిర్మాణానికి నా వంతు కృషి చేస్తా

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయకుమార్



**నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మృతి వనం నిర్మాణానికి ఇక్కడి యువత... ఆయా సంఘాల పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు చత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను కనులకు కట్టేలా నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగ గురువారం చత్రపతి శివాజీ మహారాజ్ స్మృతి వనం నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్ నిర్మాణ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కౌన్సిలర్ యు. మహేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, పళ్ళ రఘు, గోపి కృష్ణ, నవీన్ తదితరులు ఉన్నారు.

## హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకై ఉద్యమిద్దాం

### జులై 27 జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా టియుసిఐ

**నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)**

రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నటువంటి హమాలీ ఉన్నారు వాళ్లు ఎలాంటి చట్టాలు వర్తించడం లేదు తక్షణమే వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి దాని నుండి వస్తున్నటువంటి సంక్షేమ ఫలాలు వారికి అందించాలని అదేవిధంగా 60 సంవత్సరాలు దాటిన హమాలీలకు 9000 రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ తో జులై27 న తారీఖున నారాయణపేట కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలో హమాలీల అధిక సంఖ్యలో పాల్గొనాలని
తెలంగాణ ప్రగతిశీల హమాలి ఉ మిల్లు వర్కర్స్ యూనియన్ ( టియుసిఐ) జిల్లా ఉపాధ్యక్షులు బి నరసింహ అన్నారు
ఈరోజు సివిల్ సప్లై హమాలీల తో కలిసి కరపత్ర ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరం బి నరసింహ మాట్లాడుతూ హమాలీలకు భద్రతతో కూడిన సమగ్ర చట్టం చేయాలి ఇతర రాష్ట్రాల విఆర్ఓ రిసా మరియు యూపీ నుండి వచ్చిన కార్మికులకు తగిన సామాజిక భద్రత రక్షణ కల్పించాలి ప్రమాదంలో చనిపోయిన శాస్త్ర అంగవైకల్యమునకు గురైన హమాలీలకు 10 లక్షల నష్టపరిహారం సహజ మరణాలు ఐదు లక్షలు ఇవ్వాలి. ఇల్లు లేని ప్రతి హమాలి కార్మికులకు కేటాయించి ఇల్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది
ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, రఘు, వెంకటేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు



# ఆధునిక పోలీసింగ్‌కు టెక్నాలజీ కీలకం




**- జిల్లా పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ప్రారంభం**
**- డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్‌లో తొలి విడత శిక్షణ ప్రారంభం**

**మహబూబ్‌నగర్, జూలై 23( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన తొలి విడత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ దరావత్ జానకి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని, ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది శాఖలో వినియోగిస్తున్న డిజిటల్ సేవలు, సాఫ్ట్‌వేర్‌లు, ఆన్‌లైన్ వ్యవస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించవచ్చని తెలిపారు.శిక్షణలో పోలీస్ స్టేషన్లలో వినియోగిస్తున్న డిజిటల్ వ్యవస్థలు, సాంకేతిక పరికరాల వినియోగంపై ఐటీ సెల్ అధికారులు సమగ్ర అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలను దశలవారీగా జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి అందించి, సాంకేతిక నైపుణ్యాలను మరింత పెంపొందించనున్నట్లు వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఐటీ సెల్ ఇన్‌చార్జ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు రాఘవేందర్, రవి, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి



**వడ్డేపల్లి జూలై 23(ప్రజా జ్యోతి):**
వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు దీర్ఘకాలిక పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిం చారు.వడ్డేపల్లి మండలం జులకల్ గ్రామపంచాయతీలో శనివారం గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ హెచ్.రాజు అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా వ్యవసాయ అధికారి జి.రవీందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల రైతులు దీర్ఘకాలిక పంటలు సాగు చేయకుండా,తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను నివారించుకోవాలని సూచించారు. ఎరువులు,విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు,నకిలీ ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు అవగాహన కల్పించారు.గ్రామసభ అనంతరం ప్రజాప్రతినిధులు,అధికారులు,రైతులు కలిసి గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి,వ్యవసాయ గ్రామ అధికారి,ఏఎన్ఎం,ఉపసర్పంచ్,అంగన్‌వాడీ టీచర్,గ్రామ రైతులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బాదేపల్లి పిఎసిఎస్‌లో మక్కల కొనుగోళ్లలో అక్రమాలపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలి

## కలెక్టర్‌కు రైతులు, బీఆర్ఎస్ వినతి



**జడ్చర్ల, జూలై 23( ప్రజా జ్యోతి) :**
జడ్చర్ల మండలంలోని బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో మక్కల కొనుగోలు ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కూడా రైతులకు మద్దతుగా కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు.రైతులు మాట్లాడుతూ, మక్కల కొనుగోలు సమయంలో నాణ్యత పేరుతో అనవసర అభ్యంతరాలు వ్యక్తం చేయడం, తూకాల్లో వ్యత్యాసాలు ఉండడం, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, రైతుల కష్టార్జిత పంటకు గిట్టుబాటు ధరతో పాటు పారదర్శకమైన కొనుగోలు విధానం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రైతులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్‌ను రైతులు, బీఆర్ఎస్ ప్రతినిధులు మక్కల కొనుగోళ్లలో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి




**నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలోని 10 11 వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని కోటకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి కి వినతి పత్రాన్ని ఇచ్చారు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు సుభాష్, డివైఎఫ్ఐ, జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, గోవిందు, సందర్భంగా మాట్లాడుతూ అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో రోడ్డు మొత్తం గుంతలుగా మారి వర్షాకాలం వర్షం రావడంతో గుంతలుగా మారిందని అలాగే పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ వాటర్ రావడం లేదని, వీధిలైట్లు, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని సమస్యలను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమం లో లక్ష్మప్ప భీమ్ శప్ప లు ఉన్నారు

# వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**-మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్**
**- జడ్చర్లలో విద్యార్థులకు రైన్‌వాటర్ హార్వెస్టింగ్‌పై అవగాహన సదస్సు**

**జడ్చర్ల, జూలై 23(ప్రజా జ్యోతి )**
భూగర్భ జలాల పరిరక్షణకు వర్షపు నీటి సంరక్షణ అత్యంత అవసరమని, ప్రతి ఇంటి వద్ద, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్ సూచించారు.జడ్చర్ల మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన రైన్‌వాటర్ హార్వెస్టింగ్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్షపు నీటిని సక్రమంగా నిల్వ చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరతను నివారించవచ్చని, నీటి సంరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు, ఇంకుడు గుంతల నిర్మాణ విధానం, భూగర్భ జలాల పెంపు అవసరంపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈ సందేశాన్ని తమ కుటుంబాలకు, పరిసర ప్రాంతాల ప్రజలకు చేరవేసి నీటి సంరక్షణపై చైతన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ అశోక్, వార్డు ఆఫీసర్ కృష్ణయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, పాఠశాల కరస్పాండెంట్ వీణ శివకుమార్, మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# మృతుని కుటుంబానికి భరోసా



**కల్వకుర్తి జులై 23 ప్రజా ( ప్రజా జ్యోతి )**
మండల పరిధిలోని రాచూరు గ్రామానికి చెందిన గంగాధరి రాములు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ద్వారా తెలుసుకున్న ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరా మార్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుని కుటుంబానికి 5 వేల రూపాయలను అంద జేశారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట మాజీమునిసిపల్ చైర్మెన్ సత్యం, మాజీ ఎంపీపి పుట్ట రామ్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపి అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, నాయకులు నాగులు నాయక్,అంజి నాయక్,అంజి మాస్టార్, వెంకటయ్య, నిరంజన్, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతితో బదిలీ అయిన జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి శారదా దేవికి ఘన వీడ్కోలు




**మహబూబ్‌నగర్, జూలై 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మహబూబ్‌నగర్ జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన శారదా దేవి గారు అసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది బదిలీ కావడంతో, గురువారం మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడ సేవలందించడం ప్రతి న్యాయమూర్తికి గౌరవకరమని అన్నారు. శారదా దేవికి బార్ సభ్యుల నుంచి లభించిన ఆదరణ ఆమె సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు మాట్లాడుతూ, శారదా దేవి న్యాయ సేవలు చిరస్మరణీయమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన శారదా దేవి మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ కోర్టులో పనిచేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, ఇక్కడి నుంచి వెళ్లడం బాధగా ఉందన్నారు. జడ్జిగా తన 21 ఏళ్ల సేవలో మహబూబ్‌నగర్ బార్ ప్రత్యేక స్థానం సంపాదించుకుందని చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందడం ఆనందంగా ఉందని, తన ఎదుగుదలకు సహకరించిన తల్లిదండ్రులు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్బుల నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షులు చంద్రమౌళి, అనంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, న్యాయవాదుల సొసైటీ అధ్యక్షురాలు రోహిణి అయ్యంగార్, ప్రధాన కార్యదర్శి కాంతారెడ్డి, సీనియర్ న్యాయవాదులు కె. ప్రతాప్‌కుమార్, ఎన్.పీ. వెంకటేష్, వినోద్‌కుమార్, ఉమ మహేశ్వరి, స్వదేశ్, వై. రవికుమార్ యాదవ్, గడ్డం గోపాల్‌తో పాటు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1 మహా ధర్నాకు సన్నద్ధం..







**చిన్నంబావి, జులై 23 (ప్రజా జ్యోతి)**
ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం టీపీయూఎస్--తపస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న నిర్వహించనున్న మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం చిన్నంబావి మండలంలోని పెద్దదగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. గణిత శిక్షణా కార్యక్రమం విరామ సమయంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) పీష్వా రాజేందర్ రావు, టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు విజయవర్ధిని సంయుక్తంగా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ మండల అధ్యక్షుడు అనుకలి శివరాముడు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను మానసికంగా, పరిపాలనా పరంగా వేధిస్తున్న సమస్యలను ప్రభుత్వం ఇకనైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా చేపట్టిన మహా ధర్నాలో సంఘాలకు అతీతంగా ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని, ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పవన్ కుమార్, నర్సింగ్ రావు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఒరే కరుణాకర్, మహిళా అధ్యక్షురాలు శివలీల, కాంప్లెక్స్ కో-కన్వీనర్లు రవి, రాజు, కోశాధికారి నరేందర్, సభ్యులు అనిత, సరిత, మస్రీన్, అనూష, దేవమ్మ, కవిత, బి.కవిత, ఉమావతి, పార్వతి, వెంకటస్వామి, నెహ్రూ,రామస్వామితో పాటు సోదర సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థినులు చదువులో ముందంజలో ఉండి ఆశించిన లక్ష్యాన్ని సాధించాలి

### జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు



**నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)**
గురువారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాలికల ఆనంద నిలయం వసతి గృహం ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశ్నలు వేస్తూ భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవాలని కలెక్టర్ కోరారు. చదువుతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని వాటి కొరకు ఒక గంట కేటాయించాలన్నారు. ఫిజికల్ ఎక్సర్సైజ్ ఎంతో అవసరం అని తెలిపారు. విద్యార్థులు హెల్తీ ఫుడ్ తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఫస్ట్ ర్యాంక్ వచ్చేలా చూసుకోవాలని తెలిపారు. తాను కూడా మీలాగే చదివానని ఈ స్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. ఎలాంటి కష్టం వచ్చినా కృంగిపోకుండా స్ట్రాంగ్ గా నిలబడాలని కలెక్టర్ తెలిపారు. ఫైనాన్స్ ఇండిపెండెంట్ ఉండాలని కలెక్టర్ విద్యార్థినులకు తెలిపారు. అనంతరం విద్యార్థినులకు ప్లేట్లు నోటు పుస్తకాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా భోజనం పప్పు గుడ్డు తనిఖీ చేశారు. అలాగే డార్మెటరీ గదులు వాష్ రూమ్స్ టాయిలెట్స్ తనిఖీ చేయడం జరిగింది.. సోషల్ వెల్ఫేర్ అధికారి అబ్దుల్ ఖలీల్, వార్డెన్ మంజుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి నారాయణపేట చేజారి చేయబడింది.

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ అడ్డాకులలో కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ

**అడ్డాకుల, జూలై 23 (ప్రజాజ్యోతి):**
దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు అడ్డాకుల మండల కేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకుల అరెస్టును ఖండిస్తూ భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో న్యాయం కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ జరగడాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేసి ప్రజల గొంతును అణచివేయాలని ప్రయత్నించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు.
ప్రజాస్వామ్య ఉద్యమాలను నిర్బంధాలతో అణచివేయలేరని, అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యా కుసుమం లహరికి సన్మానం

**కల్వకుర్తి,జులై 23 ( ప్రజా జ్యోతి )**

ఇంటర్మీడియట్ పరీక్షల్లో 1000 మార్కులకు గాను 954 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన పోతేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని లహరిని గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అభినందించి ఆమెకు శాలువా కప్పి సత్కరించారు.
ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని లహరి నిరూపించిందన్నారు. ఆమె సాధించిన విజయాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. లహరి మరింత ఉన్నత స్థాయికి చేరుకుని కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## న్యూటౌన్ దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు రెండు రోజుల్లో పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, జూలై 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని న్యూటౌన్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లు, గుంతలు ఏర్పడిన మార్గాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న మరమ్మతు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న అదనపు కలెక్టర్, గుంతలను వెంటనే పూడ్చి అన్ని మరమ్మతు పనులను రాబోయే రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవేస్, రోడ్లు డ భవనాల శాఖ, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్లను త్వరితగతిన వినియోగానికి అనువుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను నాణ్యతతో, పూర్తి చేయాలని ఆదేశించారు.



# ఏజెన్సీ పాఠశాలల ఉపాధ్యాయుల డిప్టేషన్లు రద్దు

**--జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాలు**



**నాగర్ కర్నూల్ జూలై 23**
**(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

శుక్రవారం నుంచే స్వస్థానాల్లో విధుల్లో చేరాలని డిఇఓ రమేష్ కుమార్ ఆదేశించి, విధులకు హాజరు కాకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని డిఇఓ రమేష్ కుమార్ స్పష్టం చేశారు.నాగర్ కర్నూల్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ప్రస్తుతం మైదాన ప్రాంతాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో డిప్టేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల డిప్టేషన్లన్నింటినీ తక్షణ ప్రభావంతో రద్దు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం సాయంత్రం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో డిఇఓ రమేష్ కుమార్ వెల్లడించారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాల మేరకు తక్షణం అమలులోకి వచ్చినట్లు తెలిపారు.ఏజెన్సీ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడకుండా చూడడంతో పాటు, అక్కడి...విద్యార్థులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.డిప్టేషన్‌పై మైదాన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ తమ అసలు నియామక పాఠశాలలైన ఏజెన్సీ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశం చారు.సంబంధిత..ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు కూడా ఈ ఆదేశాల అమలును పర్యవేక్షించాలని సూచించారుఈ ఆదేశాలను విస్మరించి విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై ప్రభుత్వ నిబంధనల మేరకు శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఎటువంటి మినహాయింపులు ఉండవని, ప్రతి ఉపాధ్యాయుడు తక్షణమే తన స్వస్థాన పాఠశాలలో విధుల్లో చేరాలని హెచ్చరించారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా బోధనకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటం, అక్కడి విద్యార్థుల విద్యా హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ ఉపాధ్యాయుల లక్ష్యమని, ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల ఉపాధ్యాయుల డిప్టేషన్‌లను రద్దు చేసి, ఉపాధ్యాయులను తిరిగి వారి అసలు విధి స్థానాలకు పంపిస్తున్నట్లు డిఇఓ రమేష్ కుమార్ పేర్కొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు



**ధన్వాడ జూలై 23(ప్రజా జ్యోతి)**

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా గురువారం ధన్వాడ మండల కేంద్రంలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ధన్వాడ ఇన్‌చార్జ్ ఎస్సై మహేశ్వరి తెలిపారు

ఈ సందర్భంగా బస్ స్టాండ్ పాన్ షాపులు కిరాణా దుకాణాలు నిర్మానుష్య ప్రాంతాలు తదితర ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు మత్తు పదార్థాల రవాణా నిల్వ విక్రయాలు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పోలీసు శాఖ పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తోందని ఎస్సై తెలిపారుగంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను ఎవరైనా వినియోగిస్తున్నా రవాణా చేస్తున్నా లేదా సరఫరా చేస్తున్నా వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు

ఈ ప్రత్యేక తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్ ధన్వాడ పోలీసులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్

**ఎన్ ఎస్ యు ఐ, ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ యుఎస్ఎఫ్ఐ**

**నాగర్ కర్నూల్ జూలై 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థి యువకులపై పోలీసులు దాడులపై సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో అచ్చంపేట ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు సంతోష్ ఎస్ఎఫ్ఐ తాలూకా కన్వీనర్ చరన్ డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వర్షిణీ సైదుల్ యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎండి సయ్యద్ ఎన్ ఎస్ యు ఐ అచ్చంపేట తాలూకా అధ్యక్షులు లడ్డు యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నీట్ పేపర్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి రాజీనామా చేయాలని ఢిల్లీలో విద్యార్థులు యువతలపై జరిగిన పోలీసుల దాడులపై సమగ్ర విచారణ జరిపించాలని మరియుతక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చెయ్యాలి తక్షణమే నీట్ పేపర్ బాధిత వహిస్తూ అతనిపై కఠిన చర్యలను తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు ఎన్ టి ఏ ను తక్షణమే రద్దు చేయాలి విద్య కేంద్రీకరణ విధానాలను వెనక్కి తీసుకోవాలని వారు కోరారు నీట్ పేపర్ ను రాష్ట్రాలకే అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు నీట్ పేపర్ రద్దు కావడం వల్ల చనిపోయిన విద్యార్థులకి నష్టపరిహారం చెల్లించాలని కోరారు దాడుల్లో గాయపడిన విద్యార్థులకి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు ప్రశ్నించే హక్కును కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని వారు విమర్శించారు నిరసన కారులను అరెస్టు చేసి బంధించడం సరికాదని వారు అన్నారు. విద్యార్థి యువజన సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకుజులై 24న విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త బంకు...పిలుపునిస్తున్నామన్నారు ఈ బంద్ కువిద్యార్థి యువజన మేధావులు ప్రవేట్ యజమాన్యం ప్రభుత్వ అధికారులు సహకరించాలని కోరారు విద్యార్థి సంఘ నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అవుట వెంకటేష్ లడ్డు యాదవ్ శంకర్ రాజు ప్రవీణ్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.




## జూలై 24న 'విజన్ ఇండియా--2047' జాతీయ సదస్సుపై మీడియా సమావేశం

**మహబూబ్‌నగర్, జూలై 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జూలై 24 (శుక్రవారం) మధ్యాహ్నం 12:30 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ ఆగస్టు 7, 8 తేదీల్లో కన్హా శాంతి వనంలో నిర్వహించనున్న "విజన్ ఇండియా--2047" రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. సదస్సు ప్రధాన లక్ష్యాలు, కార్యక్రమాల రూపకల్పన, దేశవ్యాప్తంగా పాల్గొనే ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, పరిశ్రమల ప్రతినిధుల భాగస్వామ్యం, వివిధ అంశాలపై నిర్వహించే సాంకేతిక సమావేశాలు, పరిశోధనా పత్రాల సమర్పణ, సదస్సు ఏర్పాట్లు తదితర అంశాలపై మీడియాకు వివరించనున్నారు.

ఈ మీడియా సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వవిద్యాలయ అధికారులు కోరారు.

# నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

## డీఎస్పీ వెంకట్ రెడ్డి

**కల్వకుర్తి ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి )**

రైతులకు నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్పి వెంకటరెడ్డి హెచ్చరించారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.అమాయకత్వాన్ని ఆసరాగా వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిఘా పెంచినట్లు తెలిపారు. అధిక లాభాల కోసం కొందరు వ్యక్తులు రైతులకు తక్కువ ధరల పేరుతో నాణ్యతలేని ఎరువులను విక్రయిస్తూ పంటలకు, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని అన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో సంచులపై ఉన్న కంపెనీ వివరాలు, తయారీ తేదీ, బ్యాచ్ నంబర్, ధర తదితర అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అనుమతి పొందిన డీలర్ల వద్ద నుంచే ఎరువులు కొనుగోలు చేయాలని, కొనుగోలు రసీదులను భద్రపరచుకోవాలని చెప్పారు. కల్వకుర్తి మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో రైతులకు అనుమానాస్పద ఎరువులు విక్రయించిన అశోక్ కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. రైతులను మోసం చేసే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎక్కడైనా నకిలీ ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

సమావేశంలో సీఐ భీమ్ కుమార్, ఎస్ఐ కురుమూర్తి, వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహబూబ్ అలీకి సన్మానం

**నారాయణపేట ప్రతినిధి జూలై 23 (ప్రజా జ్యోతి)**

ఈరోజు రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహి బలి గారికి నారాయణపేట బిజెపి మైనార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ జమీర్ పాషా ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ తాజుద్దీన్ దామరగిద్ద మండల మైనార్టీ నాయకుడు అబ్దుల్ నబీ పట్టణ సీనియర్ నాయకులు సాధిక్ లాటి గారు ముస్తఫా పాల్గొన్నారు



# మత్స్యకారుల అభ్యున్నతికి మరో ముందడుగు

-బిజినపల్లిలో చేపల విక్రయ కేంద్రం ప్రారంభం
-మత్స్యకారుల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం
-ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ :: జులై 23 (ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని బిజినపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మత్స్యకారుల చేపల విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గురువారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల స్థితిగతులను మెరుగుపరచడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మత్స్య కారుల రంగం కీలక పాత్ర పోషిస్తోందని మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అన్నివిధాల అండగా నిలుస్తుందని, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా నేడు మత్స్యకారులకు మెరుగైన వసతులు,మార్కెటింగ్ సదుపాయాలు కల్పించబడుతున్నాయని,భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,మత్స్యశాఖ అధికారులు,మత్స్యకార సంఘాల ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# దైవచింతనతో మెలగాలి

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**కల్వకుర్తి, జులై 23 (ప్రజా జ్యోతి)**

ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించాలని చేస్తున్న విశ్వశాంతి మహాయాగం ఎంతో గొప్పదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహిస్తున్న విష్ణు పంచాయతనం, ఆయుత చండి, అతి రుద్రం, విష్ణు పంచాయతనం, శ్రీకృష్ణ కాలచక్ర, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేక కార్యక్రమాలతో పాటు హోమాలు, కుంకుమార్చనలు, కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తూ మానవాళి సుఖశాంతులతో జీవించాలని నిర్వహిస్తున్న యాగం కల్వకుర్తి ప్రజలకే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ మంచి చేయాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు, వ్యాపారులు, సమాజంలోని ప్రతి ఒక్కరు సుఖశాంతులతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సమాజ హితం కోసం చేస్తున్న యాగాలు ఫలితాలు ఇచ్చి అందరికీ మంచి జరగాలని జయపాల్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి మాట్లాడుతూ భక్తులు, ప్రజలు కుల మతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి యాగంలో భాగస్వాములు అవుతుండడం ఆనందదాయకమన్నారు. ప్రపంచ మానవాళి అంతా సుఖసంతోషాలతో జీవించాలని సంకల్పంతో యాగాలు ప్రారంభించినట్లు తెలిపారు. గురువారం యాగ ఆవరణలో రుత్వికులు వేదమంత్ర ల ఉచ్చరణతో కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం శ్రీ లక్ష్మి కుబేర, పాశుపత, అష్టలక్ష్మి, గురు గ్రహ హోమాలను నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ గా జరిగింది. హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణం, భజనలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. 3000 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం, ఎంపీపీ కొండూరు గోవర్ధన్, జూలూరు రమేష్ బాబు, కల్వ మనోహర్, జూలూరి ప్రకాష్, పోలా సురేందర్, కల్మిచర్ల గోపాల్, బాదం రాఘవేందర్, వాసా శేఖర్, శ్రీధర్, కిషన్, జంగయ్య గౌడ్, మదన మురళి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు మహిళలు ప్రముఖులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

## -జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్

నాగర్ కర్నూల్ : జులై 23 (ప్రజా జ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని,విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,అందుకనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని జిల్లా విద్యాధికారి ఏ. రమేష్ కుమార్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెల్కపల్లి, లింగాల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన,పాఠశాల నిర్వహణ,విద్యాభ్యాసన స్థాయి,హాజరు,మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం అమలు,తదితర అంశాలను పరిశీలించి ఈ సందర్భంగాఉపాధ్యాయులు నిర్వహిస్తున్న తరగతులను ప్రత్యక్షంగా వీక్షించి,విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు.తెల్కపల్లిమండలంలోని గౌరెడ్డిపల్లి ఎంపిపిఎస్‌తో పాటు లింగాల మండలంలోని మక్దూంపూర్ ఎంపీపీఎస్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లింగాల,అప్పాయిపల్లి ఎంపీయూపీఎస్ తదితర పాఠశాలలను సందర్శించి పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి బోధన విధానంపై ఉపాధ్యాయులకు సూచనలు చేసి అనంతరం విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం చదవడమే కాక వాటిని అర్థం చేసుకొని ఆచరణలో వినియోగించే స్థాయికి చేరేలా బోధన ఉండాలన్నారు.పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించి ప్రతి విద్యార్థి అభ్యాసన స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ అందించాలని విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి పరిశు భ్రత,క్రమశిక్షణకు అత్యంతప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లింగాల కేజీబీవీని సందర్శించి తరగతిలో బోధన,విద్యార్థినులకు కల్పిస్తున్న సదుపాయం,వంటశాల,భోజనశాల,తాగునీటి సౌకర్యం,పరిశుభ్రతను పరిశీలించిన అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరీక్షించి విద్యార్థినులతో వారి విద్యాభ్యాసం, వసతి,భోజనం,ఇతర సౌకర్యాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అనంతరం లింగాల మండలంలోని అప్పాయిపల్లి ఎంపీయూపీఎస్‌లో విద్యార్థుల నమోదు పెంపుతో పాటు నాణ్యమైన బోధన ద్వారా విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపరుస్తున్న ఉపాధ్యాయులను అభినందించి ఇదే స్ఫూర్తితోప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని అన్నారు.ఈ ఆకస్మిక తనిఖీల ద్వారా పాఠశాలల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేపడతామన్నారు.ఈ తనిఖీలలో సూపరింటెండెంట్ సుజాత,ఏఎంఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



# విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహమే నిజమైన పెట్టుబడి

## ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : జులై 23 (ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్ పట్టణంలోని జబీ= హైస్కూల్లో 10వ,తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులతో 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు గురువారం ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి చేతుల మీదుగా ల్యాప్‌టాప్ లను అందజేశారు.అనంతరం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ,ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని నేటి విద్యార్థులే రేపటి భారత దేశ నిర్మాణ శిల్పులని,విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు,జిల్లాకు,పాఠశాలకు మంచి పేరు తేరావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్,వైస్ చైర్మన్ బాదం రమేష్,టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కా రాజు,కౌన్సిలర్లు నిజామొద్దీన్,పద్మమ్మ ,ఖాజాఖాన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బోరు కృష్ణయ్యకు ఏదైనా హాని జరిగితే బీజేపీ నాయకులదే బాధ్యత:

## ప్రజాసంఘాల హెచ్చరిక

**గండీడ్, జులై 23 (ప్రజాజ్యోతి):**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలో గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బోరు కృష్ణయ్యపై ఇటీవల బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా స్పందిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని మాత్రమే బోరు కృష్ణయ్య డిమాండ్ చేశారని, ఆయన ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని మాట్లాడలేదని నాయకులు పేర్కొన్నారు.

సామాజిక అంశాలపై స్పందించే వ్యక్తిపై అసత్య ఆరోపణలు చేయడం తగదని, ఆయనకు ఎలాంటి హాని జరిగినా అందుకు గండీడ్ మండల బీజేపీ నాయకులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. బోరు కృష్ణయ్యపై చేసిన ఆరోపణలకు బీజేపీ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో గండీడ్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ర్యాగారి భగవంతు రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కప్లాపూర్ ఆశన్న, పీపీఎస్ డైరెక్టర్ చిట్యాల బసయ్య, సీనియర్ నాయకుడు గాధిర్యాల్ చిన్న హనుమయ్య, మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు హస్నాబాద్ వెంకటయ్య, సిటిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు వివేకానంద్, కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు చిట్లపల్లి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు కొండాపూర్ చెన్నయ్య, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు కర్రె మహేందర్, హస్నాబాద్ చంద్రయ్య, కొమ్ము అనిల్, మాజీ ఉపసర్పంచ్ మ్యాకలకాడి చెన్నయ్య, బాబ్రీ, వేపూరి శ్రీనివాస్, పగిడ్యాల్ పుల్లయ్య, వేపూరి వెంకటేష్, కొండాపూర్ కేశవులు, వేపూరి నర్సింలు, సల్కర్‌పేట్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

